## కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ సిస్టం ప్రారంభం



ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి : జిల్లా అధికారి స్థాయి నుండి అటెండర్ వరకు ప్రతి ఒక్క ఉద్యోగి పద్ధతి ప్రకారంగా సమయపాలన పాటించి మంచి సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి యాక్సెస్ కార్డు ద్వారా బయోమెట్రిక్ సిస్టంను ప్రారంభించారు. ఈ మాసం జీతం అటెండెన్స్ యాప్ ఆధారంగా చెల్లించబడతాయని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఏఇ

శామీర్‌పేట, మార్చి 3, ప్రభాతవార్త

మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని అలియాబాద్ విద్యుత్ సెక్షన్ ఏఇ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ విద్యుత్ సెక్షన్ ఏఇ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో ఇళ్లకు, వ్యవసాయంకు,పరిశ్రమలకు సంబంధించి కనెక్షన్స్ వాటికి విద్యుత్ సరఫరాకు శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు అంతరాయం కల్గుతుందని వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు. లక్ష్మాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి

**-అధికారులు విధులకు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు**

**-జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**

కోట్‌పల్లి, మార్చి 3 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా చూడాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు బంట్వారం మండలంలోని రోంపల్లి గ్రామంలో విస్తృతంగా పర్యాటించి పల్లె ప్రకృతి వనం, హరితహారం, నర్సరీ, డంపింగ్‌యార్డ్, వైకుంఠదామంలతో పాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లను పరిశీలించారు. ముందుగా రోంపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వంట గదిని సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈసందర్భంగా చదువులలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రతి రోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఏమి పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను సందర్శించి వండిన భోజనం నాణ్యతను పరిశీలించారు. వారానికి కనీసం రెండుసార్లు విద్యార్థులకు గుడ్లు అందిచాలన్నారు. వంటలు పరిశుభ్రంగా ఉండాలని అయన సూచించారు. పాఠశాలలోని పరిసరాలలో ఆహ్లాదాకర వాతవరణంతో పాటు చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్యా సదుపాయాలు బాగుంటే గ్రామాలు బాగుపడుతాయన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. కంటి సమస్యల పరిష్కరం కోసం ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు శిబిరాలను గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్వాంటిటీ ముఖ్యం కాదని క్వాలిటిగా పనిచేసి మంచి సేవలు అందిచాలని వైద్యాధికారులకు సూచించారు. పల్లె ప్రకృతివనం, హరితహారం నర్సరీ, డంపింగ్‌యార్డ్, వైకుంఠదామాన్ని సందర్శించి నిర్వహణ సక్రమంగా లేనందున సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులలో నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ శంకరయ్యను సస్పెండ్



బంట్వారం మండల పరిధిలోని రోంపల్లి గ్రామంలో కంటి వెలుగు శిభిరాన్ని సందర్శించి వృద్ధురాలుతో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి



రోంపల్లి ప్రాథమిక పాఠశాలో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి

చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పల్లె ప్రకృతి వనాలకు ప్రజలు సాయంత్రం పూట వస్తే ఆహ్లాదకరంగా పార్కులాగా ఉండాలన్నారు. చెత్తా చెదారంతో నిండిన పల్లె ప్రకృతి వనాన్ని పదిహేను రోజులోపు అందంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి చెట్టుకు సాసరింగ్ చేసి ప్రతి రోజు నీరు పట్టాలని అధికారులకు అదేశించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన ప్రతి మొక్కను నీరు పోసి సంరక్షించాలని అయన సూచించారు. నర్సరీలో అవసరమైన మొక్కలను పెంచాలన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్లు ట్రీలీలు,ట్యాంకర్లను అందించడం జరిగిందని వీటిని వినియోగించి ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడిపొడి చెత్తాను వేరువేరుగా సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. చెత్తాను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించాలన్నారు. వైకుంఠ దామాలను వినియోగంలోకి తీసుకరావలని ఇందులో నాటిన మొక్కలను సంరక్షించాలని ప్రతి రోజు నీరు పోయాలని సూచించారు. గ్రామానికి తిరిగి పదిహేను రోజుల తారువాత వస్తానని పరిస్థితి మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విధులకు నిర్లక్ష్యం వహించే అదికారులను ఇంకా వంద మంది నైనా సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఎన్ ఆర్‌ఇజిఎస్ నిధులక్రింద గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్ల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈనెల 15 లోపు ఎఫ్‌టిఓ లను వెంటనే జనరేట్ చేయాలని సంబంధిత అధికారులకు అదేశించారు. పర్యాటనలో భాగంగా గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులు కలెక్టర్‌కు ఘనంగా సన్మానించారు. తమరు వచ్చిన తారువాత ధరణి సమస్యలు పరిష్కారం అవుతున్నాయని గ్రామంలో మరో 200, ధరణి సమస్యలు ఉన్నాయని విన్నవించుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని సమస్యలకు పరిష్కరం జరుగుతుందన్నారు. మీసేవా కేంద్రాలలో చార్జీలు తప్ప ఒక రూపాయి ఖర్చు చేయాల్సి అవసరం లేదని వారు పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో ఎంపీడీఓ బాలయ్య, తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి చంద్రప్ప, ఎంపీపీ ప్రభాకర్,జడ్పీటీసీ సంతోష, ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీఓ, విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ శ్రవణ్‌కుమార్, వైద్యాధికారులు డాక్టర్ సాయిబాబా, డాక్టర్ మేనక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్, ఏపీఓ సుధాకర్, గ్రామ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

## సెలబ్రిటీ క్లబ్ ప్రాంగణంలో మొక్కలు నాటిన గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్



శామీర్‌పేటలోని సిలబ్రిటీక్లబ్ రిసార్టులో గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ మొక్కలు నాటిన దృశ్యం

శామీర్‌పేట, మార్చి 3, ప్రభాతవార్త

శామీర్‌పేట సమీపంలోని సిలబ్రిటీక్లబ్ రిసార్టును రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ సందర్శించి మొక్కలు నాటారు. శుక్రవారం మధ్యాహ్నం శామీర్‌పేట సిలబ్రిటీక్లబ్ రిసార్టును కొద్దిసేపు విశ్రాంతి కోసం గవర్నర్ తమిళిసై సందర్శించారు. అయితే నగరం నుంచి శామీర్‌పేట రాజీవ్‌రహదారిన మేడ్చల్ మండలం రాజబొల్లారం తండాలో జరిగే కార్యక్రమానికి ముందుగా గవర్నర్ వెళ్లారు. ఆ తరువాత కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి రాజబొల్లారం తండ నుంచి శామీర్‌పేట రాజీవ్‌రహదారి మీదుగా నగరానికి బయలు దేరుతూ గవర్నర్ తమిళిసై శామీర్‌పేట సమీపంలోని సిలబ్రిటీ క్లబ్ రిసార్టును సందర్శించారు. సిలబ్రిటీక్లబ్‌కు విశ్రాంతి (టీ) కోసం విచ్చేసినందున గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చేత సిలబ్రిటీక్లబ్ యాజమాన్యం వారు ఆ ప్రాంగణంలో మొక్కలు నాటటానికి ఏర్పాట్లు చేశారు. సిలబ్రిటీక్లబ్ ప్రాంగణంలో ఆమె మొక్కలు నాటారు. సిలబ్రిటీక్లబ్ ప్రాంగణంలో మొక్కలు బాగా పెంచుతున్నారని, గార్డెన్స్ బాగున్నట్లు, పచ్చదనాన్ని పెంచి ఆహ్లాదకర వాతావరణంను అందిస్తున్నారని సిలబ్రిటీక్లబ్ యాజమాన్యంను గవర్నర్ తమిళిసై అభినందించారు. ఈ కార్యక్రమంలో సిలబ్రిటీక్లబ్ రిసార్టు సిఎండి విజయ్ సేన్‌రెడ్డి, ఎండి రోహిత్‌రెడ్డి, జిఎం సురేశ్, ఆర్ఎం హర్రి జోసఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**-మేడ్చల్ కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా**

**-పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్స్**

**-మద్దతు పలికిన కాంగ్రెస్ నాయకులు**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి మార్చి 3, ప్రభాతవార్త

అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు జిల్లాలోని అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు ధర్నా చేశారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు అంగన్‌వాడి ఉద్యోగులు నిరసన తెలుపుతూ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. దీనికి సిఐటియు నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడ పాల్గొని మద్దతు తెలిపి సంఘీభావం తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగ అంగన్‌వాడి ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటు ధర్నాలో పాల్గొంటున్నారు. తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడి ఉద్యోగులు సమ్మెకు దిగి ధర్నాలో పాల్గొనటం జరిగింది. ఈ సందర్భంగ పాల్గొన్న టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల అంగన్‌వాడి ఉద్యోగులు రెండు రోజుల పాటు కలెక్టరేట్ ముందు సమ్మెలో భాగంగ పాల్గొని ధర్నా చేయటం జరుగుతుందని ఇదీ శోచనీయమన్నారు. వేతనాలు కూడ వారికి సకాలంలో ప్రభుత్వం ఇవ్వక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఐసిడిఎస్‌ను ప్రభుత్వ నిర్వీర్యం చేయటానికి కుట్ర పన్నుతుందని విమర్శించారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగ జీతభత్యాలను ప్రభుత్వం వెంటనే పెంచాలన్నారు. టీచర్లతో సమానంగ వేతనాలు అంగన్‌వాడి టీచర్లకు ఇవ్వాలన్నారు. ఇఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే అంగన్‌వాడి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటూ పోరాటాలకు దిగుతుందని హరివర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తామన్నారు. అంగన్‌వాడి టీచర్ల, హెల్పర్ల సమస్యలు పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో వారితో పాటు మేడ్చల్ నియోజకవర్గ, మండలాల, మున్సిపాల్టీల కాంగ్రెస్ నాయకులు వేముల మహేశ్‌గౌడ్, బి.జైపాల్‌రెడ్డి, వై.శంకర్‌గౌడ్, బి.గోపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పి.లక్ష్మినారాయణ, శ్రీనివాస్ యాదవ్, వి.మురళీగౌడ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు. దీనిలో అంగన్‌వాడి ఉద్యోగులు ధర్నాలో సిఐటియు జిల్లా, మండల నాయకులు తదితరులు కూడ పాల్గొన్నారు.



అంగన్‌వాడి ఉద్యోగుల ధర్నాలో మాట్లాడుతున్న టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి, పాల్గొన్న



జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడి ఉద్యోగులు, పాల్గొన్న సిఐటియు నాయకులు

# గరిబోళ్లను తొక్కేసి... కార్పొరేటుకు వత్తాసు

**- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**

**- గ్యాస్ ధరల పెంపుపై బీఆర్ఎస్ ఆందోళనలు**

షాద్‌నగర్, మార్చి 3, (ప్రభాతవార్త) : దేశంలో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో సామాన్య ప్రజలు అతలాకుతలం అవుతున్నారని, గరిబోళ్లను తొక్కేసు... కార్పోరేటుకు వత్తాసు పలుకుతున్న కేంద్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలను పెంచుతూ సామాన్య ప్రజలను అథ:పాతాళానికి తొక్కేస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సిలిండర్ ధరల పెంపు పై శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టాలు. అందులోభాగంగా షాద్‌నగర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆందోళన కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుం దేశంలో పేదొడిని కొట్టు ఉన్నోడికి పంచు అన్న చందంగా తయారైందని కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆయన విమర్శించారు గత ఐదు సంవత్సరాల క్రితం 400 నుంచి 500 వరకు ఉన్న సిలిండర్ ధర నేడు 1150 రూపాయలు చేయడం చాలా బాధకరమైన విషయమాని, ఇలా ధరలు పెంచుకుంటూ పోతే సామాన్య ప్రజలు ఏమైపోవాలని ఆయన ప్రశ్నించారు. కార్పోరేట్ వ్యక్తులకు దోపిపెడుతున్న బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే రూ.16లక్షల కోట్లు మాఫీ చేసిందని, వారికి మరింత దోచిపెట్టడానికే సిలిండర్ ధరలను పెంచుతుందని ఆయన ఆరోపించారు. నేడు దేశంలో ఎక్కడ చూసిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ వ్యవస్థకు అప్పగిస్తూ, కులమతల మధ్య విబేదాలు సృష్టిస్తుందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు ప్రజలు పడుతున్న బాధలు చూడలేకనే మన ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో సేవలు అందించడానికి బీఆర్ఎస్ పార్టిని స్థాపించారని, రాబోయే రోజుల్లో బీజేపీ పార్టీకి ఓటమి తప్పదని ఆయన అన్నారు. దేశంలో బీజేపీ పార్టీ ఆగడాలను అడ్డుకునే దమ్మున్న నాయకుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన కొనియాడారు. ఇకనైనా బీజేపీ ప్రభుత్వం నిత్యావసర ధరలను తగ్గించి సామాన్య ప్రజలను కాపాడాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో తహసీల్దార్‌కు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపాల్ ఛైర్మన్ నరేందర్, వైస్ ఛైర్మన్ నటరాజన్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ విశ్వం, మహిళ నాయకురాలు రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు వెంకట్‌రాంరెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ లక్ష్మీ నర్సింహ్మారెడ్డి, మహిళా కౌన్సిలర్లు మాధురి నందకిషోర్, జూపల్లి కౌలస్య, పిల్లి శారదశేఖర్, జీటీ శ్రీనివాస్, సర్వర్ పాషా, ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు నడికూడ యాదగిరి యాదవ్, ఏజాజ్, యుగంధర్, సర్పంచులు ముబీన్ గోరి, కె.నర్సింలు, శ్రీనివాస్‌యాదవ్, ఎంపీటీసీ భీష్వ రామకృష్ణ తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ముందు మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్.

## అంగరంగ వైభోవంగా కాశీవిశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన

కొత్తూర్, మార్చి 3, ప్రభాతవార్త : ఈ ప్రపంచంలో కాశీ విశ్వనాథ స్వామి ఆలయం అత్యంత గొప్ప ఆలయం అని హిందువులకు ఇది ఎంతో పవిత్రమైన ఆలయం, అలాంటి శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి మందిరాన్ని గూడూరులో నిర్మించడం గొప్ప శోచనీయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. కొత్తూర్ మండలంలోని గూడూరు గ్రామంలో శుక్రవారం శ్రీకాశీ విశాలాక్షి సతీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా షాద్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్, బీజేపీ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గం నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డిలు పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తన భక్తి పాటలతో ప్రజలను ఆకట్టుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.... గ్రామంలో గ్రామ ప్రజలందరూ నియమ నిష్టాలతో పవిత్రంగా ఆరు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ సంబరాలను నిర్వహించడం గొప్ప శోఛనీయమన్నారు. ఆ కాశీ విశ్వేశ్వరుని దయవల్ల గ్రామంలోని పాడిపంటలు సుఖసమృద్ధిగా పండి ప్రజలందరూ విశ్వేశ్వరుని ఆశీర్వాదంతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ పరమేశ్వరుని మనసారా కోరుకుంటు న్నామన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ వివిధ గ్రామ సర్పంచులు, ఎంపీటీ సీలు తదితరులు ఉన్నారు.



విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

## ఉరి వేసుకుని బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

కీసర, మార్చి3, ప్రభాతవార్తః ఉరి వేసుకుని బిటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కీసర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా కీసర మండలం కరీంగూడ గ్రామానికి చెందిన నల్లరాళ్ల ఆకాష్‌రెడ్డి (20) చీర్యాల గీతాంజలి కళాశాలలో బిటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. కాగా శుక్రవారం ఉదయం "నా చావుకు ఎవరూ కాదు" నాన్న "అక్కను బాగా చూసుకో" అని సూసైడ్ నోట్ రాసి ఉరి వేసుకుని బలవర్మరణం చేశాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు, ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### గవర్నర్ సమావేశంలో అవమానానికి గురైన మేడ్చల్ ఎంపిపి

**మేడ్చల్, మార్చి 3. ప్రభాతవార్త ః** గవర్నర్ సమావేశంలో మేడ్చల్ ఎంపిపికి అవమానం జరిగింది. శుక్రవారం మేడ్చల్ మండలంలోని రాజబొల్లారం తండాలో కేంద్ర ప్రభుత్వం పథకాన్ని రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో గవర్నర్ ప్రారంభించిన జన ఔషద హెల్త్ క్యాంపులో నిర్వహకులు ప్రోటోకాల్ పాటించకపోవడంతో పలువురు అసహానానికి గురై అవమానంగా భావించారు. అందులో ముఖ్యంగా మేడ్చల్ ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి కార్యక్రమానికి వెళ్లగా అక్కడ ఆమెను ఎవరు కూడ సక్రమంగా ఆహ్వానించకపోవడం గమనార్హం. వెదికపైకి తండా సర్పంచ్, ఎంపిటిసిని ఆహ్వానించినా మండల ఎంపిపిని మాత్రం వేదికపైకి ఆహ్వానించకపోవడంతో అక్కడున్న ఎంపిపి అవమానానికి గురై గవర్నర్ మాట్లాడకముందే సభ నుండి ఆమె వెళ్లిపోవడం వివాదంగా మారింది. అంతే కాకుండా నిర్వహకులు అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో పాటు జడ్పీ సీఈవో దేవసహాయం అక్కడే ఉన్న వారిని గుర్తించకపోవడం శోచనీయం

### సిపిఐ నియోజకవర్గ కార్యదర్శిగా మైముద్

**కొడంగల్, మార్చి 3ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గం సీపీఐ పార్టీ కార్యదర్శిగా ఎండీ.మైముద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. సీపీఐ పార్టీ వికారాబాద్ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం గురువారం హైద్రాబాద్‌లోని మూక్దుమ్ భవన్‌లో నిర్వహించినట్లు తెలిపారు. సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమ్‌నేని సాంబశివరావు, చాడ వెంకట్‌రెడ్డిలు హజరుకాగా కొడంగల్ నియోజకవర్గ పార్టీ కార్యదర్శిగా బొంరాస్‌పేట్ మండలంలో రేగడిమైలారం గ్రామానికి చెందిన ఎండీ, మైముద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శిగా ఎన్నికైన మైముద్ పార్టీలో గత 18 సంవత్సరాలుగా అనేక భూ పోరాటాలు నిర్వహించి జైలుకు వెళ్ళడం జరిగిందన్నారు. అతని పోరా టాలను గ్రహించిన అధిష్టానం ఆయనకు నియోజకవర్గ కార్యదర్శిగా నియ మించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఎండీ.మైముద్ నియెజకవర్గ కార్య దర్శిగా ఎన్నిక కావడం పట్ల ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఇందనూర్ బషీర్, మండల కార్యదర్శులు శ్యాంసుందర్, ఎం.రాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# అలగ్..సలగ్...

**-నిరసనలో సైతం కలిసిరాని గులాబీ నేతలు**

**-గులాబీ పార్టీలో గుప్పుమన్న వర్గ విభేధాలు**

వికారాబాద్, మార్చి3, ప్రభాతవార్త: వంట గ్యాస్ సిలండర్ ధరను పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అధినేత ఆదేశించడం జరిగింది. దీంతో వికారాబాద్ జిల్లా కేంద్రంలో సైతం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నిరసన కార్యక్రమం విజయవంతం అయినప్పటికీ..గులాబీ పార్టీలో వర్గ విభేదాలు ఉన్నట్లు తేటతెల్లమైంది. పార్టీ జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టగా.. ఎమ్మెల్యే అసమ్మతి వర్గమైన బీఆర్ఎస్ నాయకులు వడ్ల నందు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనంద్ వెంట కౌన్సిలర్లు, ఇతర నాయకులు పాల్గొనగా, వడ్ల నందు వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ భర్త చిగుర్లపల్లి రమేశ్‌కుమార్, కోటపల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రాంచెంద్రారెడ్డి, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ జె.హన్మంత్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రాజేందర్‌రెడ్డి, అంజనేయులు, బందెల్లి, కౌన్సిలర్ చందర్‌నాయక్ లు పాల్గొన్నారు. ఇరువురు ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఒకే పార్టీ కి చెందిన నాయకులు అలగ్..సలగ్ నిరసన కార్యక్రమాలు నిర్వహించడంపై గులాబీ పార్టీలో వర్గ విభేధాలు ఉన్నట్లు తేటతెల్లమైంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీలో వర్గవిబేధాలు తారా స్థాయికి చేరుకోనుండటంతో ప్రతిపక్ష పార్టీలకు అవకాశంగా మారనుందనే చర్చ వినపిస్తుంది. గురువారం బంట్వారం మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ సీనియర్ నాయకులకు ఆహ్వానం లేకపోవడం..ఎంపీ వ్యాఖ్యలు ఎమ్మెల్యే అసమ్మతి వర్గం నాయకులను కలతచెందే విధంగా ఉడటంతో పార్టీ విభేధాలు మరింత పెరిగాయంటూ పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైన పార్టీ అధిష్టాన పెద్దలు కల్పించుకుని పార్టీలో ఉన్న కొత్త..పాత నాయకుల మధ్య దూరాన్ని దగ్గర చేసి పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలని, లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో వర్గ విభేధాలు ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.



ఎమ్మెల్యే ఆనంద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు



వడ్ల నందు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

## విద్యార్థులకు వీధి కుక్కల దాడుల నుండి సంరక్షణపై అవగాహన సదస్సు



అన్నోజిగూడ జడ్పీ ప్రభుత్వ పాఠశాలలో వీధి కుక్కల దాడుల సంరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 3, ప్రభాతవార్త:**
వీధి కుక్కల పట్ల విద్యార్థులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ జడ్పీ ప్రభుత్వ పాఠశాలలో వీధి కుక్కల దాడుల నుండి సంరక్షణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ కుక్కల బారిన పడకుండా విద్యార్థులు దూరంగా ఉండాలని కుక్కలున్న చోట నుండి విద్యార్థులు ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మీ బస్తీల్లో వీధికుక్కలు ఎక్కువగా ఉంటే మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించాలని అన్నారు. వీధికుక్కల దాడుల నుండి సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గోడ పత్రికలను విద్యార్థులకు చైర్మన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు కమిషనర్ ఎ. సురేశ్, డాక్టర్ శోభన, ఉపాధ్యాయులు అనురాధ, సత్యనారాయణ, భవానీ, విజయలక్ష్మి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి గెలుపుతో విజయోత్సవ ర్యాలీ



ఘట్‌కేసర్ అంబేద్కర్ చౌరస్తాలో మిఠాయిలు తినిపించుకుంటున్న బిజెపి నాయకులు

**ఘట్‌కేసర్, మార్చి 3, ప్రభాతవార్త:**
ఈశాన్య రాష్ట్రాలలో బిజెపి విజయం సాధించడం పట్ల ఆపార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ పట్టణంలో మున్సిపల్, మండలశాఖ అధ్యక్షులు విప్పర్ల హనుమాన్, చలువాది ప్రవీణ్‌రావుల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్‌టెర్మినల్ వరకు నాయకులు నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపి బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ముందు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి గెలుపుకు దోహదం చేశాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సీబీఎఫ్‌సీ సభ్యులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, పార్టీ మున్సిపల్, మండల ప్రధానకార్యదర్శులు గుండ్ల రామతీర్థ, బొక్క రవీందర్‌రెడ్డి, కొటగిరి ప్రభంజన్‌గౌడ్, రాచకట్ల శ్రీశైలం, ఉపాధ్యక్షులు సాల్వే రఘు, మాజీ ఉపసర్పంచ్ కొమ్మిడి దామోదర్‌రెడ్డి, వార్డుసభ్యులు బెలె సురేశ్, జిల్లా నాయకులు పల్లె మధుసూధన్‌గౌడ్, చుక్కల రవిశంకర్, మున్సిపల్, మండల నాయకులు పవన్‌యాదవ్, కొన్నె మాధవి, విక్రాంత్‌రెడ్డి, బసవ రాజుగౌడ్, కట్ట రాజశేఖర్‌రెడ్డి, సాయిలు, సిద్దిరాజు, పల్లె శివ, వెంకటేశ్‌రెడ్డి, సురేంద్ర, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

### ఏయూకి సిస్కో ఉత్తమ అకాడమీ అవార్డు



అవార్డు పత్రాలను అందుకుంటున్న ఏయూ డీన్ విష్ణుమూర్తి

**ఘట్‌కేసర్, మార్చి 3, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయం సిస్కో అవార్డు లభించింది. ప్రతిష్టాత్మకమైన సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ సిస్కో వార్షికోత్సవం సందర్భంగా వివిధ విభాగాలలో జాతీయస్థాయి అవార్డులను ప్రకటించింది. ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, విఖ్యాత విశ్వవిద్యాలయాలు ఈఅవార్డుకు ధరఖాస్తు చేసుకోగా అనురాగ్ యూనివర్సిటీకి సిస్కో బెస్ట్ అకాడమీ 2023 అవార్డులను ప్రకటించారు. ఈమేరకు ఏయూ డీన్ డాక్టర్ జి.విష్ణుమూర్తితో పాటు జి.ప్రభాకర్‌రాజు, కుమార్‌నీరజ్‌లు వార్షికోత్సవంలో పాల్గొని అవార్డును అందుకున్నారు. ఏయూకు చెందిన 1,910 మంది ఐటిఐ, సైబర్‌సెక్యూరిటీ తదితర అంశాలలో సిస్కో సర్టిఫికేషన్ పూర్తి చేశారు. దాదాపు 214 మంది విద్యార్థులు సిస్కో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. ఈసందర్భంగా ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.రామచంద్రం అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని అవార్డులు సాధించాలని సూచించారు.

### కంటి వెలుగు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి



వృద్ధురాలికి కంటి అద్దాలు అందజేస్తున్న చైర్మన్ కొండల్ రెడ్డితో పాటు కౌన్సిలర్ పోచమ్మ తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 3, ప్రభాతవార్త:**
అంధత్వ నివారణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లి 16 వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ మోటుపల్లి పోచమ్మతో కలిసి చైర్మన్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరంలో ఉచితంగానే కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు అందజేస్తారని అవసరమైతే కంటి శస్త్రచికిత్సలు సైతం చేస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు కమిషనర్ ఎ. సురేశ్, స్థానిక కౌన్సిలర్ మోటుపల్లి పోచమ్మ, ఎస్. సుధాలక్ష్మి, ఎస్. రవీందర్ గౌడ్, నాయకులు మోటుపల్లి శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, కంటి వైద్య నిపుణులు శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆనందకరంగా పండుగలను జరుపుకొండి

శామీర్‌పేట మార్చి3,ప్రభాతవార్త : హోలీ పండుగతో తమ రంగుల వైభవానికి స్వాగతం చెప్పడానికి ఇది సమయం ప్రజలు అందర్నీ ఒకచోట చేర్చి,వారిలో ఉద్వేగాన్ని ఏకం చేసే ఆనందకరమైన పండుగ ఇది అనడంలో ఎలాంటి సందేహం లేదు.తమ పరిపూర్ణమైన హోలీ పార్టీని నెరవేర్చడానికి అమేజాన్ ఫ్రెష్‌పై సూపర్ వేల్యూ డేస్ సమయంలో కస్టమర్స్ తమ షాపింగ్ అవసరాలను తాజా పండ్లు, కూరగాయలు,పూజ మరియు పార్టీ అవసరాలను 45శాతం వరకు డిస్కౌంట్‌తో పొందవచ్చు.నిత్యావసరాలు మరియు ఇంకా ఎన్నోవాటిపై ఆఫర్స్‌తో కస్టమర్స్ 1 నుండి 7 మార్చి వరకు షాపింగ్ అందుబాటులో ఉంటుంది

## మాదిగలను చైతన్య పర్చేందుకే పాద యాత్ర..

**-ఎంఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ**

**వికారాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:**
ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై బిజెపి ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకై మాదిగలను చైతన్య పరిచేందుకు ఈ నెల 6 నుంచి జిల్లాలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పీఎ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ తెలిపారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ వికారాబాద్ జిల్లా కమిటీ అత్యవసర సమావేశాన్ని జిల్లా కేంద్రంలో డీఆర్‌డీఏ సమాఖ్య భవన్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోళ్ల శివ మాదిగ గారు హాజరై ప్రసంగించారు. ఈనెల 6 న కొడంగల్ చౌరస్తా నుంచి పాదయాత్రగా ప్రారంభమై జాతీయ రహదారి మీదుగా వివిధ గ్రామాలలో ఉండే మాదిగ పల్లెలు చైతన్య పరుస్తూ.. బిజెపి ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మార్చి 15న తెలుగు రాష్ట్రాల రాజధాని ల ముట్టడి కార్యక్రమం లక్ష్యంగా ఈ పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. పరిగి మీదుగా మన్నెగూడ, చేవెళ్ల, శంకర్పల్లి, రంగారెడ్డి జిల్లాలో కలిసే రూట్ మ్యాప్ నిర్ణయిం చుకోవడం జరిగిందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత చేసితీరుతామని బీజేపీ హామీ ఇచ్చిందని, నేడు మాట మార్చిందంటూ గుర్తు చేశారు. 8 సంవత్సరాలు గడిచిన ఆ సమస్యను పెడచెవిన పెడుతుందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికలలోపు మాదిగలకు



సమావేశం అనంతరం నినాదాలు చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు, మహాజన్ సోషలిస్టు పార్టీ నాయకులు

ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి ఇచ్చిన హామీలు నెరవేర్చు కొని ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి కార్యకర్తలు తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాజన్ సోషలిస్టు పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ పి.ఆనంద్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్, మహాజన సోషలిస్టు పార్టీ సీనియర్ నాయకులు స్వామిదాస్, మల్లేష్, పుష్పలత, అప్పగల రమేష్, సుభాష్, శ్రీనివాస్, ఆనంద్, శ్రీశైలం, దప్పు మోహన్ మాదిగ, బాబురావు మాదిగ, తానం నర్సింలు మాదిగ,ప్రకాష్, బిక్షపతి,దప్పు జగన్, తిరుపతయ్య పాల్గొన్నారు.

## అధికారమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పని చేయాలి

**యాచారం, మార్చి 3 ప్రభాతవార్త**
రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపుతుందన్నారు. అదే విధంగా రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాహుల్‌గాంధీ చేసిన 3500 కిలోమీటర్ల కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేసిన పాదయాత్ర విజయవంతమైందన్నారు. ఈ పాదయాత్రలో రాహుల్ దేశ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలుసుకున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కంటక విధానాలను ప్రజలకు తెలియజేశారన్నారు. భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రజల కష్ట నష్టాలను తెలుసుకుంటూ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు జరిగిన ప్రయోజనాలను వివరిస్తున్నారన్నారు. ఆ యాత్రకు అనుబంధంగా తెలంగాణలో ప్రతి చోట నాయకులు, కార్యకర్తలు పాదయాత్రలు నిర్వహిస్తున్నారన్నారు. రాహుల్ సందేశాన్ని ప్రతి కార్యకర్త గడప గడపకు అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలపై అభిమానంతో తమ నాయకురాలు సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణను ఏర్పాటు చేస్తే ఇక్కడ అధికారాన్ని చేపట్టిన టిఆర్ఎస్ రాష్ట్రంలో కుటుంబ పాలనను కొనసాగిస్తూ తెలంగాణ భవిష్యత్‌ను అంధకారంగా చేశారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి బిజెపి, బిఆర్ఎస్‌లు కాంగ్రెస్ పార్టీని నష్టపరిచేందుకు కలిసి ప్రయత్నిస్తున్నాయన్నారు.

పాలనా సమయంలో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఎన్నికల సమయంలో డబ్బును వెదజల్లి అధికారం చేజిక్కించుకోవచ్చని టిఆర్ఎస్, బిజెపిలు తప్పుడు ఆలోచనలు చేస్తున్నాయన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో ఈ రెండు పార్టీల కుట్రలను వారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కార్యకర్తలు, ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### రాజబొల్లారం తండాకు నిధులు మంజూరు చేయాలి

**గవర్నర్‌ను కోరిన సర్పంచ్ మాంగ్యా నాయక్**



**మేడ్చల్, మార్చి 3. ప్రభాతవార్త :** తమ గ్రామానికి నిధులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని, ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి నిధులు మంజూరి కావడం లేదని కోరుతూ గవర్నర్ నిధుల నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని రాజబొల్లారం తండా సర్పంచ్ మాంగ్యా నాయక్ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కోరారు. మేడ్చల్ మండలంలోని రాజబొల్లారం తండాకు పిఎంబిజెపి కార్యక్రమానికి శుక్రవారం ముఖ్య అతిథిగా గవర్నర్ విచ్చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తండాలు గ్రామ పంచాయతీలుగా మారిన క్రమంలో తమ గ్రామ పంచాయతీలకు ఎలాంటి ప్రత్యేక నిధులు అందడం లేదని, అత్యధిక జనాభ కలిగిన తమ తండాలో గ్రామ అభివృద్ధికి తగిన నిధులు సమకూరక ఇబ్బందులకు గురౌతున్నామన్నారు. సిబ్బందికి సైతం జీతాలు చెల్లించలేకపోతున్నామని ఆయన గవర్నర్ ముందు ఆవేదన వ్యక్తం చేశాడు. తమ నిధుల నుండి గ్రామానికి రూ. 2 కోట్లను వెంటనే మంజూరి చేస్తే తండా అభివృద్ధి చెందుతుందని ఆయన కోరడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్యన కోల్డ్‌వార్ జరుగుతుండగా ప్రభుత్వం నుండి తమకు నిధులు సమకూరడం లేదని ఇప్పటికే సర్పంచ్‌లు ఆరోపిస్తున్న తరుణంలో ఓ సర్పంచ్ నేరుగా గవర్నర్‌ను నిధులపై అభ్యర్థించడంతో అక్కడ ఉన్న నాయకులు అధికారులు అవాక్కై బిత్తరపోయారు.

## ప్రభుత్వ పాఠశాలలో అన్ని సమస్యలే...

**- వైఎస్సార్ టీపీ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం**



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ టీపీ పార్టీ నాయకులు.

**షాద్‌నగర్, మార్చి 3, (ప్రభాతవార్త) :** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సమస్యలే ఉన్నాయని, సమస్యల మధ్య సతమతమవుతున్న విద్యార్థులను, పాఠశాలను పట్టించుకోవడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ టీపీ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం ఆరోపించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను వైఎస్సార్ టీపీ పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం మాట్లాడుతూ... పాఠశాలలో అనేక సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాల భవనం గోడ కూలడంతో పాటు, పాఠశాల పూర్తి అపరిశుభ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పాడైపోయిన ఆహారం పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని, విద్యార్థుల సమస్యలు పట్టించుకోకవడం లేదని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాధులైన పాఠశాలలను పట్టించుకోకపోతే విద్యార్థులు చదువులు ఎలా కొనసాగిస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకుంటున్న పాఠశాలల భవనాలను పున:నిర్మించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నడుచుకుంటూ వెళుతూ కుప్పకూలి మృతి చెందిన విద్యార్థి

**మేడ్చల్, మార్చి 3. ప్రభాతవార్త :** గుర్తు తెలియని కారణంతో ఓ విద్యార్థి అక్కడకక్కడే కుప్పకూలి మృతి చెందిన సంఘటన శుక్రవారం సీఎంఆర్ కళాశాలలో చోటు చేసుకుంది. మేడ్చల్ మండల పరిధిలోని కండ్లకోయలో గల సీఎంఆర్ ఈసీ కళాశాలలో సచిన్ చౌదరి సీఎస్ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సుచిత్రా ప్రాంతంలో నివసముండే అతను యదావిదిగా శుక్రవారం కళాశాలకు వచ్చి తరగతులకు హాజరయ్యారు. మధ్యాహ్న సమయం తర్వాత తోటి విద్యార్థుల స్నేహితులతో కలిసి కళాశాల కారిడార్‌లో నడుచుకుంటూ వెలుతూ ఒక్కసారే కుప్పకూలిపోయాడు. దీంతో తోటి విద్యార్థులు ఆయోమయానికి గురై అతనిని పక్కనే ఉన్న సీఎంఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా నడుచుకుంటూ వెలుతూ కేవలం 18 సంవత్సరాలు గల విద్యార్థి ఒక్కసారిగా కుప్పకూలిపోవడం ఆచ్చర్యానికి గురి చేసింది. మొదట ఏదో జరిగిందని అనుకున్నప్పటికినీ కళాశాలలోని సీసీ పుటేజీ అధారంగా గమనించడంతో విద్యార్థి నడుచుకుంటూ వెళుతూ గోడకు తగిలి కుప్పకూలినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు కళాశాలకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా తన కుమారుడికి ఎలాంటి అనారోగ్య కారణాలు ఏమి లేవని, ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో తెలిసిరావడం లేదని విలపించారు.

## బిజెపితోనే సుస్థిరపాలన....



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు

**షాబాద్, మార్చి 3, ప్రభాతవార్త :**
బీజేపీతోనే సుస్థిరపాలన సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జంగారెడ్డి తెలిపారు. గురువారం రాత్రి మండల పరిధిలోని మన్మర్రి గ్రామంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల్లో దళితులకు 3ఎకరాలు, 100పడకల ఆసుపత్రి, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఇంటికో ఉద్యోగం, కేజీటూపీజీ హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైయ్యారన్నారు. ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకే చేరవేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షులు కిరణ్, సర్పంచ్ సుహాసినిసత్యనారాయణ, ఉప సర్పంచ్ గోపాల్, నాయకులు వెంకటేష్, చంద్రశేఖర్, శంకరయ్య, ముస్లియ్య, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళశాలలో ప్రవేశ పరీక్షా సెంటర్

**సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి : ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శర్మ**

**మొయినాబాద్, మార్చి 3, ప్రభాతవార్త :**
తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళశాల 2023, 2024 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు గాను టిఎస్‌డబ్లూఆర్, సివోఈ సెట్ 2023ను మరియు 2024 విద్యాసంవత్సరానికి డిగ్రీ లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు గాను టి.జి.యూ.జి.సి.ఈ.టి సెట్ కు సంబంధించి ఈ నెల 5వ తేది ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు, ప్రవేశ పరీక్షల కోసం టి.ఎస్. డ.బ్లూ.ఆర్.డి.సి. వికారాబాద్ కళశాలలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ డా.కె. శ్రీనివాస్ శర్మ ఒ ప్రకటనలో తెలిపారు, పరీక్షా కేంద్రానికి వచ్చే విద్యార్దులు ముఖ్యంగా గమనించాల్సిన విషయం కళశాల అడ్రస్ మొయినాబాద్ నుండి చేవెళ్లకు వెళ్లే దారిలో మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామంలో ఉన్న ఎస్.వి గ్రూప్ ఆఫ్ ఇన్స్‌ట్యూషనల్లో నిర్వహించ బడుతుందని తెలిపారు, పరీక్ష కు హాజరయ్యే విద్యార్దులు తల్లి,దండ్రులు కళశాల అడ్రస్‌ను గమనించాలని ప్రిన్సిపాల్ డా.కె. శ్రీనివాస్ శర్మ తెలిపారు, అందుకుగాను తోల్కట్ట గేటు నుండి, కళశాల కు దారి తెలుసుకోవడానికి ఫ్లెక్సీలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు, తల్లి,దండ్రులు శనివారం సెంటర్‌లను ముందుగానే చూసుకుంటే అడ్రస్ కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం పరిస్థితులు ఏర్పడవన్నారు, హాల్‌టికెట్‌లు విదిగా తీసుకోని రావాలని, హాల్‌టికెట్‌లో పుట్టినతేది, కులం, లాంటి, ఏమైనా వివరాలు పొరపాటుగా ప్రచురించబడి ఉంటే సవరించేందుకు సంబంధించిన సర్టిఫికెట్లు తెలచ్చుకోవాలని ఆర్‌సివో డా.శారద తెలిపారు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో ప్రవేశాలకు గాను టిఎస్‌డబ్లూఆర్, సివోఈ, సెట్ ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యహనం 1 గంటల వరకు డిగ్రీ కళశాలలో అడ్మిషన్‌లకు గాను టిజియుజి సెట్‌ను మధ్యహనం 2:30 గంటల నండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వ హించన్నట్లు తెలిపారు, విద్యార్దులు పరీక్షా కేంద్రానికి అర గంట ముందే రావాల ని, ఆలస్యంగా వచ్చిన విద్యార్దులను పరీక్షకు అనుమతించబడరని తెలిపారు.

### ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

**తపస్ రాష్ట్ర నాయకులు రాగి రాములు**

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 3, ప్రభాతవార్త :** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర నాయకులు రాగి రాములు అన్నారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల తపస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకోసం చేస్తున్న ప్రచారంలో బాగంగా రామాయంపేటలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, వాటిని పరిష్కరించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటస్వామి, రఘుషా, కృష్ణమూర్తి, శేఖర్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

### సాంకేతిక అభివృద్ధికి బాధ్యతయుతంగా యుపిఎస్

శామీర్ పేట మార్చి3,ప్రభాతవార్త : యుపిఎస్ దేశంలో దాని సాంకేతిక కేంద్రాల నెట్‌వర్క్‌ని విస్తరించడానికి 15=20 మిలియన్ల మధ్య వ్యూహాత్మక పెట్టుబడిని చేస్తోంది.ఈ కేంద్రాలు యుఎస్ మరియు యురోప్‌లో ఇన్ హౌస్ సాంకేతిక అభివృద్ధికి బాధ్యత ఉన్న యుపిఎస్ యొక్క సాంకేతిక బృందాల ఉనికిని పూర్తిస్థాయి యుపిఎస్‌ని ఉత్తమ డిజిటల్ వినియోగదారు అనుభవంతో ప్రపంచ శ్రేణి లాజిస్టిక్స్ ప్రదాతగా చేసే పరిష్కారాలు, యుపిఎస్ ఈ కేంద్రాల ద్వారా దేశీయ ఉద్యోగ సృష్టికి కట్టుబడి ఉంది 2025 అకరుకల్లా కనీసం 1000 ఉద్యోగుల వరకు తీసుకోడాన్ని లక్ష్యంగా చేసుకుంది.ఇటీవలీ పెట్టుబడులతో యుపిఎస్ దేశంలో వేగంగా దాని ఉనికిని విస్తరిస్తోంది.

## కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం



కుక్క కాటుకు గురి కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోస్టర్‌ని విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

**కీసర, మార్చి3, ప్రభాతవార్త:**
నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలలో సంచరిస్తున్న కుక్కలను నివారించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తెలిపారు.శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుక్కల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా పలువురు కుక్క కాటుకు గురయ్యారని అందుకే ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.మున్సిపల్ మొత్తం సుమారు 4 వేల వరకు కుక్కలు ఉన్నాయని అంచనా వేశామన్నారు.కుక్క కాటుకు గురి కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మున్సిపల్ సిబ్బంది ద్వారా ప్రజలకు తెలపడం జరుగుతుందన్నారు.అనంతరం కుక్క కాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోస్టర్‌ని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో కమీషన్ వాణిరెడ్డి,వైస్ చైర్మన్ బండారి మల్లేష్,కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్,పంగ హరిబాబు,సుర్వి శ్రీనివాస్‌గౌడ్,కో ఆప్షన్ మెంబర్ షఫీ,నాయకులు సురేష్,గూడూరు ఆంజనేయులు గౌడ్,కౌకుట్ల క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సినీనటుడు సుమన్‌ను కలిసిన అప్జల్‌ఖాన్



.సినీనటుడు సుమన్‌ను కలిసిన కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి ఎండి అప్జల్‌ఖాన్,పాల్గొన్న తదితరులు

**శామీర్‌పేట, మార్చి 3, ప్రభాతవార్త**
ప్రముఖ సినీనటుడు సుమన్‌ను కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా బిఆర్ఎస్ నాయకులు ఎండి అప్జల్‌ఖాన్ మర్యాదపూర్వకంగ కలిశారు. శుక్రవారం శామీర్‌పేట మండలం నుంచి నగరంలోని తెలంగాణ భవన్‌కు వెళ్లటంతో అక్కడ విచ్చేసిన సినీనటుడు సుమన్‌ను ఎండి అప్జల్‌ఖాన్ మర్యాదపూర్వకంగ కలుసుకోవటం జరిగిందన్నారు. సినీ ఇండస్ట్రీస్‌లో ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందిన సినీనటుడు సుమన్ తెలంగాణలో ప్రధాన భూమిక పోషించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సుమన్‌ను కలిసిన వారిలో అప్జల్‌ఖాన్‌తో పాటు కెసిఆర్ సేవాదళం మేడ్చల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.శశికాంత్‌యాదవ్, మమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

### వచ్చే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి : శేరి నర్సింగ్‌రావు

**పూడూరు, మార్చి 3, ప్రభాతవార్త :** అన్ని పార్టీలు వచ్చే పార్లమెంట్,అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువతకు ప్రాధాన్యత కల్పించాలని ఉమ్మడి రంగారెడ్డిజిల్లా బిజెపి మాజీ నాయకులు శేరి నర్సింగ్‌రావు సూచించారు. శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడలో విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం వంశ పారంపర్యంగా రాజ్యాధికారాలను అధిష్టించే హక్కు ఎవరికీలేదని వివరించారు.స్వాతంత్ర్యం సిద్ధించిన నాటినుండి ఆర్థికంగా ఎదిగినవారే ఎదుగుతూ అనగారిన వర్గాలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన చెందారు.గత 40 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్,బిఆర్ఎస్ తదితర పార్టీలు యువతకు కనీసం ఉపాధికూడ చూపించలేక పోయాయని ఆరోపించారు.కేవలం డబ్బులున్న వారికే కాకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండే యువతకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు కేటాయిస్తే పేద వర్గాలకు న్యాయం జరిగే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పూడూరు మండలానికి చెందిన పలువురు యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూడూరు మండలం మన్నెగూడలో మాట్లాడుతున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ నాయకులు శేరి నర్సింగ్‌రావు తదితరులు

### కాంగ్రెస్‌లో చేరిన పలువురు మైనారిటీ యువకులు

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 3, ప్రభాతవార్త :**
రామాయం పేట మున్సిపాలిటీలోని పలువురు మైనారిటీ యువకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో మార్పు వస్తుందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ హయాంలోనే మైనారిటీలకు తగిన ప్రాధాన్యత లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు శ్యామ్‌రెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు చింతల యాదగిరి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు పల్లె రాంచందర్‌గౌడ్, 1వ వార్డు కౌన్సిలర్ బొర్ర అనిల్‌కుమార్, బైరం కుమార్, బొట్ల బాబు, యూత్ కాంగ్రెస్ నేతలు భానుచందర్, మధుగౌడ్, మర్కు సతీష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### మొదటి స్థాయి సంఘ సమావేశం నిర్వహణ

**మెదక్, మార్చి3 ప్రభాతవార్త:**
జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ అధ్యక్షతన పనులు, ఆర్థిక, ప్రణాళిక అంశాలపై మొదటిస్థాయి సంఘ సమావేశాన్ని శుక్రవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసన మండలి సభ్యులు శేరి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖ, ఇరిగేషన్, వాటర్ గ్రిడ్, సీపీవో శాఖలపై చర్చించారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-IV METROPOLITAN MAGISTRATE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT LB NAGAR
O.S. No. 597 OF 2022
BETWEEN:
1. **Koppineni Raghavamma,** W/o. Late K.Satyanarayana, Aged about 62 years, Occ.: House Wife, R/o. Plot No.158, Flat No.103, Swastik Towers, Motinagar, Hyderabad - 500018.
2. **Koppineni Sudheer,** S/o. Late K. Satyanarayana, Aged about 38 years, Occ.: Private Employee R/o. Plot No.158, Flat No.103, Swastik Towers, Motinagar, Hyderabad - 500018.
3. **Koppineni Sasikanth,** S/o.Late K. Satyanarayana, Aged about 36 years, Occ.: Private Emplpoyee, R/o.D.No.: 9-192, Jamadagni Street, Ashok Nagar, Vijayawada, Andhra Pradesh- 520007.
...Plaintiffs No.1 to 3
AND
1. **The Mandal Revenue Officer,** Ghatkesar Mandal, Medchal Malkajgiri District, Telangana-501301
2. **The Mandal Revenue Officer,** Mahcilipatnam, Krishna District, Andhra Pradesh-521001
3. **All the concerned**
...Defendant no.1 to 3
Please take notice that the above named Petitioners filed above suit for Declaration to declare Plaintiffs No.1 to 3 as Legal Heirs of Late Koppineni Satyanarayana, against the Respondents No.1 to 3, which stands posted on dt. 07-03-2023 at 10:30 a.m. for appearance of Respondent No.3, you are required to appear before the Hon'ble Court either in person or through an advocate without fail, otherwise the case will be decided in accordance with law.
SCHEDULE OF PROPERTY
ITEM NO. I: All that the Piece and parcel of the Housing site bearing plot no.29, admeasuring 200 square yards, in survey no.176/A,176/Aa, 178/A,Aa, 182/Aa, situated at Kondapur Village, Ghatkesar Mandal, Under Kondapur Gram Panchayat, Ranga Reddy District (Now Medchal-Malkajgiri District) Under S.R.O. Ghatkesar, bounded by: North : 30' Wide Road, South: Owner's Land, East: Plot No.30, West: Plot No.28.
ITEM NO. II: All that the Piece and parcel of the Open Plot admeasuring 212.57 square yards, in Municipal Ward No.20, Near Door No.20/516-1, situated at Parasupeta, Machilipatnam Town, Krishna District, Andhra Pradesh, vide Registered Doct. No.2156 of 2009, dated 03-06-2009, registered at Machilipatnam SRO, Krishna District, Andhra Pradesh. North: Adjacent to this compound wall land belonging to Cosmopolythene land, 40', South: Land of Vasudha sold by Krishna Mohan, 40', East: 48'.2" Road, West: Land Krishna Mohan, 47'.6".
// BY ORDER OF THE COURT //
**M/s. S. MAHESH KUMAR, CH.VENKATESWARA RAO, ADVOCATES**
Counsel for the Plaintiff No.1 to 3, # Flat No.302, 'A' Block, AMEENA COMPLEX, Opp. Survey of India, Uppal, Hyderabad – 500039.
Ph.: 9505676999

## మండలంలో ఇసుక ఫిల్టర్స్ ధ్వంసం



చుక్కాపూర్‌లో ఇసుక డంప్‌ను గుర్తించిన రెవెన్యూ అధికారులు

**తలకొండపల్లి మార్చి3,ప్రభాతవార్త :**

తలకొండపల్లి మండల పరిధిలోని చెన్నారం,జంగారెడ్డి,ఎడవెల్లి గ్రామాలల్లో ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేసినట్టు తహసీల్దార్ కృష్ణ తెలిపారు.తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తహీసల్దార్ మాట్లాడుతూ...మండలంలో ఇసుక ఫిల్టర్‌ను అరికట్ట డానికి మండలంలో ఒక ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు అందులో భాగంగా ఆర్ఐ మంజుల మరి కొంతమంది సిబ్బందితో కలిసి జంగారెడ్డిపల్లి,ఎడపల్లి,చెన్నారం గ్రామాలలో తనిఖీలు చేపట్టినప్పుడు ఐదు ఇసుక ఫిల్టర్ దొరికాయని తెలిపారు.ఇసుక ఫిల్టర్ ధ్వంసం చేసి ఇసుకను సీజ్ చేసినట్లు మోటార్లను తీసుకువచ్చినట్లు తెలిపారు.అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేసిన వ్యక్తులపై మరియు పొలాలలో పోసుకున్న వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేయబడతాయని తహసీల్దార్ హెచ్చరించారు.ఇప్పటి నుండి మండలంలో ఇసుక ఫిల్టర్ అరికట్టడానికి మూడు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు ఈ టీంలు ప్రతిరోజు పర్యవేక్షిస్తాయని అన్నారు.ఈ సమావేశంలో డిటి సంతోష్,ఆర్ఐ మంజుల, పాల్గొన్నారు.

## చేగూరు చెరువులకు మరమ్మతులు చేయించి పునరుద్దరించాలి

**జిల్లా ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్న గ్రామస్థులు**



చెగూరులో పిచ్చిమొక్కలతో నిండి అభివృద్ధి నోచుకొని చెరువు కట్ట

**నందిగామ మార్చి3,ప్రభాతవార్త :**

నందిగామ మండలం చెగూరు గ్రామ పంచాయతీ రెవెన్యూ పరిధిలో గల చెరువులకు అత్యవసర మరమ్మతులు చేయించి పునరుద్దరించాలని చెగూరు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మంకాల శ్రీశైలం గ్రామస్థులతో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.గ్రామ పరిధిలోగల మోడం కుంట కట్టపై ముళ్ల కంప చెట్లు,పిచ్చిమొక్కలు ఎపుగా పెరిగిందని,తూం నాణ్యతలోపించి పని చేయక ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు.కుందేరావు (కర్ణమోని) కుంట,ఓరం కుంటలను మినీ ట్యాంకుబండ్‌గా రూపొందించి అభివృద్ధి చేయాలని కోరారు.ఓరం కుంట చెరువుకు తగిన మరమ్మతులు చేయించాలని,తూంలకు తగిన మరమ్మత్తులు చేయించి నీటి లీకేజీని అరికట్టాలని జిల్లా ఉన్నతాధికారులు,ఆర్డిఓ,ఇరిగేషన్ ఎఈ, తహసీల్దార్‌కు,గ్రామ కార్యదర్శులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**తలకొండపల్లి మార్చి3,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామానికి చెందిన బంగారుగడ్డ ఆగమ్మ అనారోగ్యంతో మరణించడంతో ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రేణు రెడ్డి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.2వేల ఐదు వందలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మచ్చేందర్ ,వార్డు మెంబర్ దేశమని రాములు, దైవానందం,ఫోటోల చెన్నయ్య,రాజశేఖర్,పాల్గొన్నారు.

**ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో**

మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన టైలర్ రషీద్ మరణించడంతో ఈ విషయాన్ని ఉప సర్పంచ్ అజీజ్ ద్వారా తెలుసుకున్న జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ఉప్పల ట్రస్ట్ ద్వారా మృతుడి కుటుంబానికి 3వేల రూపాయలను ఎంపిటిసి అంబాజీ,ఉప సర్పంచ్ అజీజ్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి యూసుఫ్,రహీం షకీల్,అరిఫ్, తిరుపతి,శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

**శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో :** మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన టైలర్ రషీద్ మరణించడంతో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ వారి ఇంటికి కుటుంబ సభ్యులను పరామర్శించి 3వేల రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో జిల్లా జడ్పి కో ఆప్షన్ సభ్యులు ముజీబుర్ రెహమాన్,బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు దస్తగిరి, వార్డు సభ్యులు జంగయ్య,రాజు,కారొబార్ రవి,శ్రీశైలం ,పాల్గొన్నారు.

## కెవిపిఎస్ డైరీ ఆవిష్కరణ



**తలకొండపల్లి మార్చి3,ప్రభాతవార్త :**

తలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివేక్షిత వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ చేతుల మీదు కెవిపిఎస్ డైరీని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..డైరీలో 33 జిల్లాల సంబంధించిన మండలాలు జిల్లా విస్తీర్ణం జాతీయ నాయకులు వివరాలు పూలే అంబేద్కర్ జయంతి వర్ధంతిలో అత్యాచార సమాచార హక్కు చట్టం అనేక చట్టాలు దళితులకు సంబంధించిన చట్టాలు సబ్ ప్లాన్ చట్టం స్మశాన వాటిక చట్టం ఆధ్వర్యంలో సాధించిన విజయాలు మహా నాయకుల జీవిత చరిత్రలు కెవిపిఎస్ డైరీలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ చెన్నయ్య,కెవిపిఎస్ మండల అధ్యక్షుడు వల్లింపుల యాదయ్య,కెవిపిఎస్ లింగరాపల్లి గ్రామ అధ్యక్షుడు బండగళ్ల కృష్ణయ్య,ప్రధాన కార్యదర్శి టేకూరి కుమార్ వార్డు మెంబర్ మహేష్,ఒల్లింపుల జంగయ్య,టేకూరు విజయ్ కుమార్,బి.నరసింహ,పెరుమాళ్ల నరసింహ,పాల్గొన్నారు.

## పేదలకు సిఎం సహాయనిధి వరం

**తలకొండపల్లి మార్చి3,ప్రభాతవార్త :**

సిఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన అంజయ్యకు మంజూరైన 20వేల రూపాయల చెక్కు ఎమ్మెల్సీ అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.





గ్యాస్ ధరలు తగ్గించాలని చేవెళ్ల మండల కేంద్రంలో దర్నా చేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,చేవెళ్ల ఎంపిపి విజయలక్ష్మి, జడ్‌పిటిసి మాలతీ



నందిగామలో పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్,తదితరులు



ధర్నాలో మాట్లాడుతున్న సిఎల్ శ్రీనివాస్ యాదవ్



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఆమనగల్లులో జాతీయ రహదారిపై కట్టెలతో వంట చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న గుర్కా జైపాల్‌యాదవ్



యాచారంలో జరిగిన ధర్నాలో పాల్గొన్న నేతలు



రోడ్డుపై వంటావార్పు చేస్తున్న దృశ్యం



కొందుర్గులో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

# గ్యాస్ ధరల పెంపుపై బీఆర్ఎస్ ధర్నాలు

**చేవెళ్ల మండలంలో**

**చేవెళ్ల మార్చి 3,ప్రభాతవార్త :** నిత్యవసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వంకు తగిన గుణపాఠం చెప్పాలని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిదులు దర్నా చేశారు. చేవెళ్ల జాతీయ రహదారిపై బైఠాయించి, పిఎం మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ..దేశంలో పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలు ఎందుకు తగ్గడంలేదన్నారు. పేద ప్రజలు వాడే నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతుంటే ధనికులు ప్రయాణం చేసే విమానపు ఇంధనం ధరలు తగ్గుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం సంపన్న వర్గాలకు బాసటగా నిలుస్తు, పేద ప్రజలకు వ్యతిరేకంగా నడుచుకుంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వంకు తగిన గుణపాఠం చేప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపిపి మల్గారి విజయలక్ష్మి, జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, నాయకులు రాంరెడ్డి,గిరిధర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు తదతరులు పాల్గోన్నారు.

**నందిగామ మండలంలో**

**నందిగామ మార్చి3,ప్రభాతవార్త :** నిత్యం గ్యాస్ ధరలు పెంచుతూ,సామాన్యులపై మోయలేని భారం మోపుతున్న కేంద్రంలోని మోడీ సర్కారును చిత్తుగా ఓడించాలని జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్ పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను నిరసిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పద్మారెడ్డి ఆధ్వర్యంలో నందిగామ తహసీల్దారు కార్యాలయం ముందు పార్టీ నాయకులు,కార్యకర్తలు ఆందోళన చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్ మాట్లాడారు...బంగారు తెలంగాణ లక్ష్యంగా అభివృద్ధి సంక్షేమ పథకాలతో సిఎం కెసిఆర్ దేశంలోనే నంబర్ వన్ సిఎంగా వెలుగొందుతున్నారన్నారు.రామరాజ్యం బిజెపితో సాధ్యమంటునే ప్రభుత్వరంగ సంస్థలను ఆదానీ,అంబానీ,వంటి ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పజేబుతూ దేశాన్ని భ్రష్టు పటిస్తున్నారని ఆరోపించారు.పెంచిన గ్యాస్ సీలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పెంచిన ధరలను తగ్గించాలని డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు.ఈ ఆందోళన కార్యక్రమంలో నందిగామ ,చెగూరు సింగిల్ విండో చైర్మన్‌లు తోట రాజ్‌గోపాల్, గోర్లపల్లి అశోక్,మాజీ చైర్మన్ ఎం.విఠల్ సర్పంచ్‌లు జె.కె నర్సింలు,జెట్ట కుమార్,స్వామి, చంద్రా రెడ్డి,గోవింద్ అశోక్ ,బిఆర్ఎస్ నాయకులు బుయ్యనీ వీరేందర్ గౌడ్,బండి రాజు,బి.సుదర్శన్ గౌడ్,జెట్టావత్ విజయ్ నాయక్,మేకం రాజు,జంగిలి కుమార్,తుప్పుడు నర్సింహ్మా,దార సురేష్ ,కాట్న శ్రీశైలం,అద్వకేటు శ్రీనివాస్ రెడ్డి, కల్వకోలు శేఖర్ గౌడ్,ఆకుల గణేష్,తోట భాస్కర్,బుగ్గ నర్సింహ్మా,కూతరు బుచ్చయ్య,పసుల పాండు,శ్రీశైలం, పట్వారీ శ్రావణ్,మొత్కులగూడ రమేష్,భూపాల్,కుమ్మరి వెంకటేష్,నాయకులు,కార్యకర్తలు,పాల్గొన్నారు.

**తలకొండపల్లి మండలంలో**

**తలకొండపల్లి మార్చి3,ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలను ఆదుకోవాల్సింది పోయి కార్పొరేట్ వ్యక్తులు సంస్థలకు కొమ్ముకాసే విధంగా పని చేస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం తలకొండపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటి గ్యాస్ సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ నిర్వహించిన ధర్నా,రాస్తారొకో కార్యక్రమాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల నిత్యవసర వస్తువుల ధరలు,వంట గ్యాస్ డీజీల్ ,పెట్రోల్ ధరలు పెంచి పేద ప్రజల నడ్డివిరుస్తున్నారని మండిపడ్డారు. అనంతరం బస్టాండ్ సమీపంలో మహిళలు కార్యకర్తలతో కలిసి ప్రధాన మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్,జిల్లా కో ఆప్షన్ సభ్యులు ముజీబుర్ రహేమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,రైతు కమిటీ నరసింహ,సజ్జు పాషా,ఆంజనేయులు, దస్తగిరి,యాదయ్య, హరి మోహన్ రెడ్డి,శ్రీశైలం శంకర్ నాయక్,సత్యం, కృష్ణయ్య, ఆనంద్,రమేష్,మల్లేష్,గణేష్,స్వామి,వెంకటేష్,ఉన్నారు.

**కొత్తూర్ మండలంలో**

**కొత్తూర్, మార్చి 3, ప్రభాతవార్త :** దేశంలో బీజేపీ, నరేంద్ర మోడీ పాలనలో నిత్యవసర వస్తువులపై పెనుభారం మోపి సామాన్యులను నడ్డి విరుస్తూ మహిళలకు కన్నీళ్లు మిగులుతున్నాయని, బీజేపీ పాలనలో సామాన్యులకు భారం కార్పొరేట్‌లకు వరంగా మారిందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. రాష్ట్ర అధిష్టానం పిలుపుమేరకు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ కొత్తూర్ మున్సిపల్ అధ్యక్షురాలు కొస్గి భగవద్గీత ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ ధర్నా కార్యక్రమంలో పాల్గొని తహసీల్దార్ రాములుకు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మెన్ డోలి రవీందర్, కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, సర్పంచ్ అరుణ రమేష్, ఎంపీటీసీలు రాజేందర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, లింగంనాయక్, టీఆర్ఎస్ పార్టీ కొత్తూర్ మండల అధ్యక్షులు కృష్ణయ్య, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు యాదగిరి, బీఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షులు జైపాల్, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కడాల శ్రీశైలం, పార్టీ సీనియర్ నాయకులు జనార్దన్‌చారి, మున్సిపాలిటీ బీసీసెల్ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, గోపాల్ నాయక్, ఉపసర్పంచ్ శ్రీరాములుయాదవ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బండి క్రిష్ణ, రవినాయక్, మధుసూదన్‌రావు, దామోదర్, పంపుల నర్సింహ్మాగౌడ్, జంగయ్య యాదవ్, భాస్కర్‌గౌడ్, దానం రమేష్, విజయ్, బండి సాయి, దేవేందర్‌గౌడ్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

**ఆమనగల్లు మండలంలో**

**ఆమనగల్లు, మార్చి03, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ ఆరోపించారు. 400 రూపాయలు ఉన్న వంటగ్యాసు ధరలు ఎన్డిఏ ప్రభుత్వ హయాంలో గడిచిన 8ఏళ్ళలో 1150 రూపాయలకు పెరిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా పెంచిన వంటగ్యాసు ధరలపై బిఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. మున్సిపాలిటీ పార్టీ కన్వీనర్ నేనావత్ పత్యనాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, జడ్పిటీసీ అనురాధపత్యనాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈసందర్భంగా జాతీయ రహదారి బస్టాండ్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి కట్టెలతో మంటలు పెట్టి వంట చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెట్రోలు, డీజిల్, నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య మానవుడు అవస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని చెప్పారు. పెంచిన వంటగ్యాసు ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమన్వయ సమితి మండల కన్వీనర్ నిట్టనారాయణ, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు దోనాదుల కుమార్, జిల్లా గ్రంథాలయసంస్థ డైరెక్టర్, కౌన్సిలర్ కమటం రాధమ్మవెంకటయ్య, సరితపంతునాయక్, గుత్తి బాలస్వామి, చుక్క నిరంజన్ గౌడ్, రమేశ్‌నాయక్, టి. రామకృష్ణ, పూసలి భాస్కర్ తదితరులు ఉన్నారు.

**యాచారం మండలంలో**

**యాచారం, మార్చి 3 ప్రభాతవార్త :** ప్రధాని మోదీకి ఎన్నికలు అయిపోగానే గ్యాస్ ధరలను పెంచడం ఆనవాయితీగా మారిందని బిఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్నాటి రమేష్‌గౌడ్, పాశ్చ భాషలు విమర్శించారు. జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవార ం కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ మోదీ కిలాడీ అంటూ నినాదాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, పిఎసిఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు బండిమీది కృష్ణ, హబీబుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, వన్నవడా అరుణమ్మ, ఎంపిటిసిలు దేరంగుల శారద, మెరుగు శివలీల, సుమతమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తలారి మల్లేష్, శంకర్ నాయక్, పిఎసిఎస్ డైరెక్టర్లు మద్దెల శశికళ, మక్కపల్లి స్వరూప, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మండలి గోపాల్, ప్రధాన కార్యదర్శి పోలే మహేష్, యూత్ అధ్యక్షుడు జానీబాయ్, వివిధ గ్రామశాఖ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**కడ్తాల్ మండలంలో**

**కడ్తాల్,మార్చి 03 ప్రభాతవార్త :** గ్యాస్ ధరలు విపరీతంగా పెంచిన కేంద్ర ప్రభుత్వం ద్వారా సామాన్య ప్రజలపై ఎక్కువ భారం పడడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందుకు శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ల ఆదేశాల మేరకు కడ్తాల్ మండల కేంద్రంలో పెరిగిన గ్యాస్ ధరలకు నిరసనగా ప్రజా ప్రతినిధులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, మహిళలు, సామాన్య ప్రజలు కలిసి ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు కంబాల పరమేష్ మాట్లాడుతూ... వెంటనే సామాన్య ప్రజలపై గ్యాస్ భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఆమన్‌గల్ కడ్తాల్ మండలాల పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ జోగువీ రయ్య, సర్పంచ్‌లు సులోచన, సాయిలు, భారతమ్మ, నర్సింహా, ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, ఎల్లగౌడ్, మార్కెట్ డైరెక్టర్లు లాయక్ అలీ, నరసింహగౌడ్, నాయకులు బిక్షపతి, రామచంద్రయ్య, మహేష్, గుర్కా రాజేందర్, ఇర్షాద్, కృష్ణ, జంగయ్య, రాజు, ఎర్రరామకృష్ణ, శ్రీకాంత్, శ్రీను, యాదగిరి, సురేష్, శివ, ప్రశాంత్, రవి, ప్రేమ్, మహిళలు పాల్గొన్నారు.

**కొందుర్గు మండలంలో**

**కొందుర్గు, మార్చి 3, (ప్రభాతవార్త) :** కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ల ధరను పెంచినందుకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా నిర్వహించారు. శుక్రవారం నాడు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా రాస్తారోకో నిర్వహించి తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా వినతి పత్రం సర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కావలి ఆదిలక్ష్మీ యాదయ్య, లింగంగౌడ్, నర్సింహ్మారెడ్డి, నాయకులు రామకృష్ణ, గోపాల్, రామగళ్ల సుందర్, శ్రీకాంత్‌గౌడ్, ప్రభుదాస్, ఎ.మానయ్య, గోవింద్, జగదీశ్వర్‌గౌడ్, బందూలాల్, అన్నార రవిగౌడ్, అబ్దుల్ కలామ్, గొల్ల యాదయ్య, వెంకటయ్య, సిన్, రవియాదవ్, ఉషన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**జిల్లెడు చౌదరిగూడ మండలంలో**

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 3,(ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు హాఫీజ్ అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాఫీజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడం వల్లన సామాన్యులపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. కేంద్రం వెంటనే స్పందించి పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శివమౌళి, హరినాయక్, పిఎసిఎస్ డైరెక్టర్ జబ్బార్, ఎంపిటిసి సత్యప్రమోద్‌రావు, కో ఆప్షన్ మెంబర్ నర్సింగరావు, నాయకులు మాణెయ్య, దూలయ్య, చెన్నయ్య, వెంకటేష్, అక్రమ్, లక్ష్మయ్య, అజ్మిరి, నర్సింహులు, జహాంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో జూనియర్ ఇంటర్ సివోఈ ప్రవేశ పరీక్ష

**మొయినాబాద్ మార్చి 3, ప్రభాతవార్త :**

తెలంగాణ సాంఘీక సంక్షే గురుకుల పాఠశాలలో 2023 వ సంవత్సర ఇంటర్ ప్రవేశ పరీక్ష సీవోఈ, ఈ ఆదివారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించానున్నారు. బంట్వారం గురుకుల మహిళ పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి శుక్రవారం వార్త పత్రికతో మాట్లాడుతూ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీవోఈ ఇంటర్ మీడియట్ అర్హత పరీక్షలు బంట్వారం పాఠశాలలో సెంటర్ ఏర్పాటు చేశారని అన్నారు. ప్రవేశ పరీక్ష కేంద్రం బంట్వారం సెంటర్ కోడ్( 232306) నిర్వహించనున్నారన్నారు, బంట్వారం స్కూల్ మొయినాబాద్ మండలంలోని తోల్కట్ట గ్రామ రెవెన్యూలో గల ఎస్.వి ఇంజనీరింగ్ కళశాల ప్రాంగణంలోని బంట్వారం గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు, విద్యార్థులు, వారి తల్లి, దండ్రులు బంట్వారం పాఠశాల పాఠశాల అడ్రసు మొయినాబాద్ మండలంలో, తోల్కట్ట గ్రామంలో ఉందని, తల్లి,దండ్రులు, విద్యార్థులు, అడ్రస్ కోసం వికారాబాద్ జిల్లాకు పోకుండా, మండలంలోని తోల్కట్ట గ్రామానికి రావాలని, ఇవిషయం తల్లి,దండ్రులు, విద్యార్థులు, గుర్తుంచుకోవాలని తెలిపారు, సెంటర్‌కు పరీక్షా హాజరయే విద్యార్థులు అదివారం ఉదయం 9 గంటల వరకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు, విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వచ్చేటప్పుడు హాల్‌టికేట్, ఆధార్ కార్డులు జిరాక్స్, బ్లూ లేదా, బ్లాక్ పెన్, పరీక్షప్యాడ్, తీసేకోని రావాలని తెలి పారు, మరిన్ని వివరాల కోసం సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు 8374000562 సందేహాలు ఉంటే ముందుగానే ఫోన్ ద్వార తెలుసుకోవాలని, ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు,

## గురుకుల పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈఓ కిష్టారెడ్డి

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 3,(ప్రభాతవార్త):**

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్‌లో గల బిసి బాలుర గురుకుల పాఠశాలను బుదవారం ఎంఈఓ కిష్టారెడ్డి సందర్శించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఉపాధ్యాయుడు చితక బాదిన కథనాలు పత్రికల్లో ప్రచురితమైన సందర్భంగా విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించి అక్కడ జరిగిన పరినామాలపై వివరాలను తెలిజేయాలని ఆదేశాలు జారి చేశారు. ఈ విషయమై ఎంఈఓ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులపై ఉపాధ్యాయుడు అనుసరించిన తీరును ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

## జూట మాటలు మానుకోండి : అధ్యక్షుడు కుర్మయ్య

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 03,(ప్రభాతవార్త):** బీఆర్ఎస్ నాయకులు జూట మాటలు మానుకోవాలని బీజెపి మండల అధ్యక్షుడు బోయ కుర్మయ్య అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలెకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల అయిన పేద ప్రజలకు కట్టెల పొయ్యితో వంటలు చేసుకునే దుస్థితి ఉండేదని, బీజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేద ప్రజలకు ఉచితంగ సిలిండర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళలు ఇబ్బందులు పడకుండ ఉచితంగ గ్యాస్ కలెక్షలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని పాలిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నట్లు తెలిపారు. ధరణి పోర్టల్ పేరుతో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బస్సు ఛార్జీలు, కరెంటు ఛార్జీలు, ధరణి రిజిస్ట్రేషన్ ఛార్జీలు, లిక్కరు ధరలను విపరీతంగ పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందని విమర్శించారు. భూ కబ్జాలు, లిక్కర్ స్కామ్, డ్రగ్స్ మాఫియాలో బీఆర్ఎస్ నాయకులు ఆరితేరారని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన బుద్ది చెబుతారని అన్నారు. ఈ విలెకరుల సమావేశంలో బీజెపి మండల ప్రధాన కార్యదర్శి ముర్షత్, శివకుమార్, ప్రభు, హరీష్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలి

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 03,(ప్రభాతవార్త):**

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్‌లో గల బీసి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులను చితక బాదిర ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని బిజెపి మండల అధ్యక్షుడు బోయ కుర్మయ్య అన్నారు. బుదవారం మండల బీజెపి నాయకులు గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులను విచక్షణరహితంగ కొట్టిన ఉపాధ్యాయున్ని వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు పోలీసు కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని వైస్ ప్రిన్సిఫల్ శ్రీశైలంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కోనెరు శ్రీనివాస్, మల్లేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహులు, చంద్రమౌళి, అంజయ్య,శేఖర్, భరత్, తరుణ్, రామకృష్ణ, లక్ష్మయ్య, రమేష్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని వినతపత్రం అందజేస్తున్న బీజెపి నాయకులు

## గ్రామాభివృద్ధికి కృషి..



నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ చేస్తున్న సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

**షాబాద్, మార్చి 3, ప్రభాతవార్త :**

గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమకారుడు, పెదవేడు గ్రామ సర్పంచ్ గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పెదవేడు గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి టీపీసీసీ మాజీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి తన పట్టా భూమిలో నుండి 400గజాలు గ్రామపంచాయతీ భవనానికి ఇవ్వగా, అందులో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.... గ్రామంలో నూతన పంచాయతీ భవనం నిర్మాణానికి స్థలం లేన్నందున అడిగిన వెంటనే స్పందించిన పీసరి సురేందర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, గ్రామస్థులు నర్సింలుగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, మహేందర్, అనంత్, నర్సయ్య, గోవర్ధన్‌గౌడ్, సూర్యకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**ఆర్ఆర్‌బీ మాజీ చైర్మన్ విగ్రహావిష్కరణకు భూమిపూజ**



మాజీ ఆర్ఆర్‌బీ చేర్మేన్ శ్రీనివాస్‌రెడ్డి విగ్రహావిష్కరణకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

**కొడంగల్,మార్చి 3ప్రభాతవార్త :** మాజీ రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు చేర్మేన్ దివంగత శ్రీనివాస్‌రెడ్డి విగ్రహవిష్కరణకు గాను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి భూమి పూజ చేశారు.మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో శుక్రవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మాజీ ఆర్ఆర్‌బీ చెర్మేన్ విగ్రహవిష్కరణ నిమిత్తం భూమిపూజ చేశారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఆర్ఆర్‌బీ చెర్మేన్‌గా శ్రీనివాస్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సేవ చేశాడని ఆయన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పకీరప్ప,నాయకులు ఎంట్ల మల్లయ్యతో మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్,గ్రామస్థులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి



ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు



పరిగిలో జరిగిన ధర్నాలో పాల్గొన్న బిఆర్ఎస్ నేతలు



చౌడపూర్ మండలంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, తదితరులు

**తాండూరులో**

**తాండూరు, మార్చి 3, ప్రభాతవార్త :** అడ్డగోలుగా గ్యాస్ ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న బీజెపి ప్రభుత్వానికి నిరుపేద, మధ్యతరగతి ప్రజల ఉసురు తప్పదని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ మంత్రి కేటీఆర్ పిలుపు మేర కు శుక్రవారం తాండూరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వ ర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణం లోని అంబేద్కర్ చౌక్‌లో పట్టణ అధ్యక్షులు అప్పు(నయ్యూం) ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మె ల్యే రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఖాళీ గ్యాస్ సిలెండర్లను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డగోలుగా గ్యాస్ ధరలను పెచి నిరుపేదల నడ్డివిరు స్తుందని అన్నారు. నిరుపేదల ప్రజలకు మేలు చేస్తుం దనుకున్న బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి ప్రజల ఉసురుపోసుకుంటుందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి మహిళలే తగిన గుణ పాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మార్కెట్ కమిటి చైర్మన్ విఠల్‌నాయక్, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ పట్లో ళ్ల దీపా, నాయకులు పట్లోళ్ల నర్సింలు, శ్రీనివాస్‌చారి, నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, హరిగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

**వరిగి పట్టణంలో**

**పరిగి మార్చి3, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ పలువురు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పరిగి పట్టణం లో ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వురు నేతలు మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచుతూ పేద ప్రజల నడ్డివిరుస్తుందని ధ్వజ మెత్తారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, ఎంపిపి కరణం అరవింద్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్. ఆం జనేయులు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ భాస్కర్ , పిఎసిఎస్ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు మునీర్, తంగడిపల్లి వెంకటేష్, నాయకులు సయ్యద్‌పల్లి వెంకటయ్య, మాణి క్యం , జాక్ రవికుమార్, విజయ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మంగు సంతోష్, మహిళా అధ్యక్షుడు లక్ష్మీ , హాజీ పటేల్, మండల యూత్ ప్రెసిడెంట్, జాఫర్ పల్లి, రాజు, సర్పంచ్ లు వెంకట రామకృష్ణా రెడ్డి, మాదారం సాయి, తదిత రులు పాల్గొన్నారు.

**చౌడపూర్ మండలంలో**

**చౌడపూర్ మార్చి3, ప్రభాతవార్త :** కేంద్ర వంట గ్యాస్‌పై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, వంటగ్యాస్ ధర లు పెంచిన కేంద్రంపై నిరసనగా మంత్రి కెటీఆర్ పిలు పుమేరకు పరిగి నియోజకవర్గం ఎమ్మెల్యే మహేష్ రెడ్డి ఆదేశాలతో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలతో కట్టెలపై వంట చేసి నిరసన చేపట్టారు. పలవురు మాట్లాడుతూ.. వంట గ్యాస్‌పై ధరలు పెంచి, సామాన్యుడిపై భారం మోపుతున్నారని వెంటనే తగ్గిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాందాస్ నాయక్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పంచాయతీ చాంబర్ కార్యదర్శి వెంకట్ , కో ఆప్షన్ మెం బర్ జుబేర్, సర్పంచ్‌లు రంగారెడ్డి , జనార్ధన్ రెడ్డి, రవి, ఉప సర్పంచ్ శివకుమార్, బిఆర్ఎస్ సీనియర్ నాయకు లు శివకుమార్, పాల నర్సింలు, పెంటయ్య, లక్ష్మయ్య, కృష్ణయ్య, యాదయ్య, యువ నాయకులు, రాజశేఖర్, శంకర్, శ్రీకాంత్ రెడ్డి, అశోక్, అంజయ్య, కార్యకర్తలు, మహిళాలు, పాల్గొన్నారు.

**మర్పల్లి మండలంలో**

**మర్పల్లి మార్చి 3 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం పెంచి న గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతు బిఆర్ఎస్ నాయ కులు శుక్రవారం నాడు మండల కేంద్రంలో ధర్నా నిర్వ హించారు తాసిల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ వర కు నిరసన ర్యాలి నిర్వహించారు పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని నినాధాలు చేశారు కేంద్ర ప్రభుతం పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచి ప్రజల నడ్డివిరుస్తు న్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి జెడ్పి టిసి మదుకర్‌లు అన్నారు సామాన్య ప్రజలకు అందని విధంగా గ్యాస్ ధరలు పెంచి దగా చేస్తున్నారని అన్నారు ప్రజలు తిరిగి కట్టెల పొయ్యికి పరిమితమయ్యే రోజులు వస్తున్నాయని అన్నారు కేద్ర ప్రభుత్వం పేదలను కొట్టి అంబాని ఆదానికి పెడుతున్నారని అన్నారు పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని వారు డిమాండ చేశారు ఈసమావేశంలో మండల ఉపాధ్యక్షులు మోహ న్‌రెడ్డి సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ యువజన నాయకులు మధు గ్రామఅద్యక్షులు గఫర్ నాయకులు రాచ్చన్న గౌస్ నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు

**పెద్దేముల్ మండలంలో**

**పెద్దేముల్, మార్చి 3, ప్రభాతవార్త:** నిత్యావసరాల వస్తు వుల ధరలు పెంచుతు బిజెపి ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల, గరిబోళ్ల ఉసురు పోసుకుంటోం దని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలను అదుపు చేయడంలో విఫలమైన ప్రధా ని మోడి ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాం డ్ చేస్తు, వంట గ్యాస్ ధరల పెంపుకు నిరసనగా రుక్మా పూర్ మాజీ సర్పంచ్ టి.రమేష్ అధ్వర్యంలో పెద్దేముల్ మండలంలోని మంబాపూర్ ప్రధాన చౌరాస్తాలో చేపట్టిన ధర్నాలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్బంగా పైలెట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేవరకు తమ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో యంపిటిసిల ఫోరం రాష్ట్ర ఉపాధ్యాక్షులు వెంకటేష్‌చారి, బిఆర్ఎస్ మండలపార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి, పెద్దేముల్ ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, ఇందూరు యంపిటిసి పటేల్ ప్రవీన్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు హైదర్, శ్రావ న్, చంద్రప్ప, పాండు, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, మాజీ వైస్ యంపిపి రుద్రారం గోపాల్‌రెడ్డి, రాధక్రిష్ణరెడ్డి, మారెపల్లి వెంకట్‌రెడ్డి, లక్ష్మన్ నాయక్, శిల్లి, మండల యూత్ అధ్యక్షుడు సంగమేశ్వర్, తట్టెపల్లి ఆంజయ్య, గిర్మాపూర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

**కొడంగల్‌లో**

**కొడంగల్, మార్చి 3ప్రభాతవార్త :** సిలెండర్ ధరల పెంపు ను నిరసిస్తు బీఆర్ఎస్ పార్టీ అద్వర్యంలో శుక్రవారం కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో ధర్నాతో ఆందోళన కా ర్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్‌చెర్మేన్ ఆర్, వాణీయాదవ్ ల ఆద్వర్యంలో మహిళలు అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొ ని పోయ్యిల కట్టెలతో వంటావార్పు చేస్తు వినూత్న తీరు లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ధర్నా కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడు తూ... పేద ప్రజలను దోచి కేంద్రం ప్రభుత్వం ఆదానీ లాంటి పెద్దలకు పెడుతున్నదని ఘాటుగా విమర్శిం చారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినా దాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయ కులు ముదిగండ్ల క్రిష్ణ, ఎంట్ల మల్లయ్య, గోడల రాంరెడ్డి, నరోత్తంరెడ్డి, కోట్ల యాదగిరి, వెంకటయ్యగౌడ్, రఘుప తిరెడ్డి, బాబర్‌లతో పాటు సర్పంచ్‌లు సయ్యద్ అంజద్, పకీరప్ప, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట్ మండలంలో**

**బొంరాస్‌పేట్, మార్చి3, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధర పెంచడాన్ని నిరసిస్తు బొంరాస్‌పేట్ మండ ల కేంద్రంలోని భూలక్ష్మమ్మ చౌరస్తాలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా(నిరసన) తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిలిండ ర్ ధరల పెంపుకు దండం కేంద్రంలో ఉన్న మోది ప్రభు త్వం దేశానికి గండం అని అయన అన్నారు. పెంచిన సిలిండర్ ధరలను వెంటనే తగ్గించి సామాన్యులపై భా రం తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి హేమీబాయి, వైస్‌ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు యాదగిరి, చాద్‌పాషా, టీటీ రామునాయక్, పిఎసిఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు మహేం దర్‌రెడ్డి, ఎంపిటీసిలు నారాయణరెడ్డి, శ్రావణ్‌గౌడ్, తిరుప తయ్య, నర్సింహనాయక్, యుత్ నాయకులు నరేషగౌడ్, మ హేందర్, రవిగౌడ్, మల్లేష్‌గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పూడూరు మండలంలో**

**పూడూరు, మార్చి 3, ప్రభాతవార్త :** పేదల నడ్డి విరుస్తు న్న కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని పలువురు మండల బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలకు నిరసనగా శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ చౌరస్తాలో మండల బిఆర్ఎస్ పార్టీ అద్వర్యంలో కట్టెల పొయ్యిపై వంటచేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వంటగ్యాస్ ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపంచారు. ఇప్పటికైనాఈ కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందిచి పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బిఆర్ ఎస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

**బషీరాబాద్ మండలంలో**



మర్పల్లిలో గ్యాస్ ధరకు నిరసనగా ధర్నా నిర్వహిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



కొడంగల్‌లో ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



పూడూరు మండలం మన్నెగూడ చౌరస్తాలో కట్టెల పొయ్యిపై వంటచేస్తూ నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ నాయకులు



దోమలో జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, తదితరులు

**బషీరాబాద్, మార్చి3, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం వం ట గ్యాస్ ధర పెంచటంతో తాండూర్ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షు డు రామునాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు బషీరా బాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నా యకులు పాల్గొని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ 410 రూపా యలు ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం 1155 చెంచటంతో సామాన్య ప్రజలపై పెనుభారం పడుతుందన్నారు. 14 సార్లు ధరలు పెంచి సామాన్య ప్రజల ఆదాయాన్ని గండి కొడుతూ ధనవంతులకు మేలు కలిగిస్తుందన్నారు. పెంచి న గ్యాస్ ధలతో పాటు నిత్యవసర సరుకులు వంట నూనె, పెట్రోల్, డీజిల్ ఇతర వస్తువులపై ధరలను వెంటనే తగ్గించాలని రాము నాయక్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా మండల విభా గం నాయకురాలు జయమ్మ, పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాం రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ రవీందర్ సింగ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోట చింతల బసవేశ్వర స్వామి జాతర ఉత్సవాలు



**చౌడపూర్ మార్చి3, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని కోట చింతల బసవేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విశిష్ట పూజలు, రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించా రు. మరికల్ గ్రామ సర్పంచ్ పాండురంగయ్య ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం కార్యక్రమం జరిపి, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శనివారం శివపార్వతుల కళ్యాణం, శకతోత్సవం కార్యక్రమాలు ఉంటాయని, రాత్రి పద్మ వ్యూహం వీధి నాటకం ఉంటుందని పూజరి మఠం సిద్దయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రామ్‌దాస్, చాకలపల్లి శేఖర్, కిష్టంపల్లి ఉప సర్పంచ్ సునీల్, కటికే శ్రీనివాసులు, మల్లేష్, భక్తులు, పాల్గొన్నారు.

## మోడీ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బిజెపి నేతలు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బిజెపి నేతలు

**తాండూరు, మార్చి 3, ప్రభాతవార్త :**

ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేసిన బిఆర్ఎస్ నేతలపై చర్య లు తీసుకోవాలని బిజెపి నేతలు తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్యాస్ ధరలను నిరసిస్తూ శుక్రవారం తాండూరులో బిఆర్ఎస్ నేతలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రధాని నరేం ద్ర మోడి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ విషయంపై బిజెపి పట్టణ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలకు నిరసనగా రాష్ట్ర ముఖ్య మంత్రి, మంత్రుల దిష్టిబొమ్మలను దహనం చేసిన విషయంలో పోలీసులు తీసుకున్న చర్యలను ఈ రోజు దేశ ప్రధాని నరేంద్రమోడి దిష్టిబొమ్మ దహనం చేసిన బిఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బిజెపి నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోమ కృష్ణ, ప్రకాష్, సంఘమేశ్వర్, కిరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న నాయకులు

**పెద్దేముల్, మార్చి 3, ప్రభాతవార్త:**

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఇందూరు యంపిటిసి పటేల్ ప్రవీన్ కుమార్ అన్నారు. తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో ఇందూరు గ్రామానికి చెందిన గంజాయి రాములుకు రూ.1 లక్షా సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్బంగా పటేల్ ప్రవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యే యంగా సిఎం కేసిఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. పేద, మద్యతర గతి ప్రజలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్య క్రమంలో యంపిటిసిల ఫోరం రాష్ట్ర ఉపాధ్యాక్షులు వెంకటేష్‌చారి, మండల బిఆర్ఎస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి, పెద్దేముల్ ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, రు క్మాపూర్ రమేష్, రెగొండి, మారెపల్లితాండా సర్పంచ్‌లు హైదర్, పాండు, మాజీ సర్పంచ్ లక్ష్మన్ నాయక్, మాజీ వైస్ యంపిపి రుద్రారం గోపాల్‌రెడ్డి, మాజీ వైస్ యంపిపి లక్ష్మన్, ఇందూరు లాలప్ప, నరేష్‌గౌడ్, ఖానాపూర్ ఉప సర్పం చ్ మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## మానవసేవ మాధవసేవ : తీగల అనితారెడ్డి



ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న జడ్పీచైర్‌పర్సన్

**షాబాద్, మార్చి 3, ప్రభాతవార్త :**

మానవసేవే మాధవసేవగా నిలుస్తుందని ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తెలిపారు. శుక్రవారం షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ స్ఫూర్తితో గిఫ్ట్ ఏ స్మైల్ కింద తన స్వంత డబ్బులతో దివ్యాంగులకు (ట్రై సైకిళ్ళ) స్కూటీల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి చేతుల మీదుగా షాబాద్‌కు చెందిన వాజిద్‌కు స్కూటీని జిల్లా పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. సమా జంలో నిరుపేదలు, దివ్యాంగులు ఎంతోమంది సహాయంకోసం ఎదురు చూ స్తున్నారని, అలాంటి వారికి సహాయం చేస్తే జీవితంలో మరుపురాని ఆనందం పొందవచ్చు అని తెలిపారు. మనం డబ్బులు ఎంత సంపాదించడం అనేది గొప్ప కాదని ఆపదలో ఉన్న వారికి ఆదుకుంటే ఎంతో గొప్పని అన్నారు. ది వ్యాంగుల కోసం ఇప్పటికే సుమారు 30లక్షలతో షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి స్కూటీలను పంపిణీ చేయడం గొప్ప విషయమని అభినందిం చారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు జడల రాజేందర్‌గౌడ్, మైనార్టీసెల్ అధ్యక్షులు ముఖురం ఖాన్, సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, నాయకులు రమేష్‌యాదవ్, మునీర్, సుధాకర్‌గౌడ్, ఇమ్రాన్, నరసింహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, సహకార సంఘాల డైరెక్టర్ నర్సింలు, అవినాష్‌రెడ్డి, యువసేన నాయకులు అజయ్, వినోద్ తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**యాచారం, మార్చి 3 ప్రభాతవార్త**

మండలంలోని తక్కెళ్లపల్లి, గునగల్ ఫీడర్‌ల విద్యుత్ మరమ్మత్తు పనులు, విద్యుత్ తీగలకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున నేడు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సందీప్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలి

..జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



మొక్క జొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

**పెద్దేముల్, మార్చి 3, ప్రభాతవార్త:** వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలంలోని గోపాల్ పూర్ గ్రామంలో రైతులు వేసిన మొక్క జొన్న పంటలను వ్యవసాయ అధికారులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్బంగా జిల్లా వ్యవ సాయ అధికారి గోపాల్ మాట్లాడుతూ రైతులు వేసిన పంటలను వ్యవ సాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. హన్మాపూర్ గ్రామంలో వ్యవసాయ సహయ సంచాలకులు రుద్రమూర్తి సందర్శించి మొక్క జొన్న పంటలపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నసీరుద్దిన్, బిటియం శ్రావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చుతారు?

-కొత్తూర్ మున్సిపల్ కమిషనర్ తీరుపై మండిపడ్డ శ్రీనివాస్‌గౌడ్

**కొత్తూర్, మార్చి 3, ప్రభాతవార్త :**

కొత్తూర్ నేషనల్ హైవే 44పై బావర్చి హోటల్, అక్కడ ఉన్న మిగిత వ్యాపార సముదాయాల కూల్చివేతలు చేపట్టడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఎలా కూర్చుతారని మున్సిపల్ అధికారు లను ప్రశ్నించారు. వ్యాపారులకు నష్టం కలిగించాలని ఉద్దేశంతోనే ఈ కూల్చివేతలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈకూల్చివేతల వల్ల కనీసం రూ.50లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. వ్యాపారులకు కనీసం ఇన ఫ్రర్మేషన్ ఇవ్వకుండా కూల్చివేత నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నిం చారు. నోటీసులు లేకుండా కూల్చడం ఏమిటని ఆయన హెచ్చరించారు. కావాలని కొంతమంది వ్యాపారులను మున్సిపల్ ఉద్యోగులు టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. ఇది సరైన పద్దతి కాదన్నారు. ఇలా చేయ దం వల్ల వ్యాపారాలు దెబ్బతిని మున్సిపాలిటీ ఆదాయం పడిపోతుం దన్నారు. కనీసం వ్యాపారులు సామాన్లు కూడా తీసుకోకుండా అలాగే కూల్చివేశారన్నారు. ఈతాతం మొత్తం ముడుపుల కోసం వ్యవహారి స్తున్నట్టు కంటికి కనపడుతుందని తెలిపారు. ఇది సరైన పద్దతి కాదని, ఇలాంటి పునరావృత్తమైతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



అక్రమంగా కూల్చిన వ్యాపారాలను పరిశీలిస్తున్న నాయకులు

# తప్పులు చేసే ఆస్కారం రావద్దు

-మున్సిపాలిటీలలో సోమవారం ప్రజావాణి

-మే 31లోపు సమీకృత వెజ్ అండ్ నాన్ వేజ్ మార్కెట్ యార్డు పనులు పూర్తి చేయాలి

-అటెండెన్స్ యాప్ తప్పనిసరి

: జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తప్పులు చేసే ఆస్కారం రాకుండా తల దించుకునే లా ఉండకూడదని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పట్టణ ప్రగతి, పారి శుధ్య, విద్యుత్తు, తాగునీరు, అటెండెన్స్ యాప్‌లపై అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల యొక్క అధికారులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులను చేపట్టాలని అన్నారు. సిబ్బంది లో స్పష్టమైన మార్పు రావాలని ప్రజల్లో నమ్మకా న్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటీస్తూ సమస్యలను పరిష్కరించే దిశగా మున్సిపల్ సిబ్బం దితో పనులు చేయించాలని, పని చేయని వారిని తొలగించడం జరుగుతుందన్న విషయాన్ని స్పష్టం గా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. పట్టణ ప్రగతిలో చేపట్టిన పన్నులన్నింటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు లేకుండా తొలగించు చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారంలో పెట్టిన మొక్కలను పాదులు తీసి ఎప్పటికప్పుడు నీరు పోయాలని తెలిపారు. మున్సి పాలిటీలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య, పనులను మార్చి 20లోపు పక్కగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**ప్రతి సోమవారం మున్సిపాలిటీలలో ప్రజావాణి**

మున్సిపాలిటీలలో సోమవారం ప్రజావాణిని నిర్వ హించి ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా పని చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యా దులను క్షుణ్ణంగా వినాలని, తమ పరిధిలో పని జరగకుంటే ఎక్కడ జరుగుతుందో సూచించాలని ప్రజావాణిలో తప్పనిసరిగా మున్సిపల్ కమిషనర్లు ఉదయం 10 : 30 నుండి 2 గంటల వరకు ఉండి ఫిర్యాదులను స్వీకరించాలని వాస్తవికంగా ఉంటే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు.

మే31లోపు సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ యార్డుల పనులను పూర్తి చేయాలని కలె క్టర్ అధికారులను ఆదేశించారు.

అటెండెన్స్ యాప్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. కార్యాలయ సిబ్బందిలో స్పష్ట మైన మార్పు రావాలనే ఉద్దేశంతో యాప్‌ను తీసు కురావడం జరిగిందని తెలిపారు. కార్యాలయ సమ యాల్లో ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలలో నమ్మకాన్ని పెంపొందించా

## కొనసాగుతున్న హాత్ సే హాత్ జోడో యాత్ర



**తాండూరు టౌన్ మార్చి3, ప్రభాతవార్త :**

భావి భారత ప్రధాని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు ఏఐసిసి మెంబర్ టీపిసి సి సీనియర్ ఉపాధ్యక్షుడు తాండూరు ఇంచార్జ్ ఎం.రమేష్ మహారాజ్ కార్యకర్తల సమక్షంలో హాత్ సే హాత్ జోడో యాత్రను తాండూరు టౌన్‌లోని 4.5.6 వార్డులలో కొనసాగిస్తూ.. ప్రజల తో మమేకమై చేయి చేయి కలుపుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ కాంగ్రెస్ వాదాన్ని వినిపిస్తూ యాత్రను సాగించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో దొరల పాలనలో ఏ ఒక్కరికి ఇల్లు రాలేదని కరెంటు బిల్లులు మోత మోదుతుందని, సిలిండర్ ధర ఆకాశానం టిందని, నిత్యవసర సరుకులు అందడం లేదని, పంటకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని ప్రజలు తమ గోడును రమేష్ మహారాజ్‌తో వెల్లిబుచ్చారు. ఈ సందర్భంగా రమేష్ మహారాజ్ మాట్లాడు తూ....రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సిలిండర్ కేవలం 500రూపాయలకే ఇస్తామని రైతులకు రుణమాఫీ చేస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ , ఉత్తమ్ చంద్ జనార్ధన్ రెడ్డి, నర్సింలు, నర్సిరెడ్డి, తాండూరు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అలీమ్ , కావలి సంతోష్ కుమార్, నాగేష్, మల్లికార్జున్, బసవరాజ్, సర్దార్ ఖాన్, దశరత్, రాము నాయక్, మెకానిక్ రాజు, మాజీ కౌన్సిలర్ రవి, బతుల భీమ్ శంకర్, బతుల వెంకటేష్, తాండూరు టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ హాబి బ్ లాలా, తాండూరు టౌన్ మైనార్టీ ప్రెసిడెంట్ కాజా, రియాజుద్దీన్, కాంగ్రెస్ కౌన్సిలర్ వరాల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు బషారత్ , మాజీ కౌన్సిలర్ వడ్డే శ్రీనివాస్, సినియర్ నాయకు లు సర్దార్ ఖాన్, హబీబ్ , బంటు వేణు, కాలేద్ సైసుల్లా స్టేట్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ , బాతుల వెంకటేష్, బాతు భీమ్ శంకర్, రాము నాయక్, కౌన్సిలర్ బాతుల నాగు, జలాల్, సమాద్, కయ్యం పాష, సయ్యద్ నవాజ్, రాము, భీము, అజం, జలల్ సమద్, జావేద్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

-బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు సన్మానం

-విద్యార్థులకు బహుమతుల అందజేత

**బొంరాస్‌పేట్, మార్చి3, ప్రభాతవార్త :** మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పుమళ్ళలో స్వయం పరిపాలన దినోత్సవంను క్లస్టర్ ఎచ్ఎం శ్రీహరిరెడ్డి అధ్వర్యంలో ఎచ్ ఎం నీలకంఠం, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించా రు. గత సంవత్సరం పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు హన్మయ్య, పద్మరావు, వినయ్, వెంకటేష్, రాహుల్, అంజనేయులును శాలువ, పూలదండతో సన్మానించారు. విద్యార్థులు ఉపాధ్యా యులుగా ప్రత్యేకంగా తయారై తమ స్నేహితులకు పాఠ్యం శాలను ఉదయం నుండి బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబరి చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందిం చారు. డిఈఓగా పూజ, ఎంఈఓగా ఆంజనేయులు, ఎచ్ఎంగా మణికంఠ ఉపాధ్యాయులుగా అర్చన, భవని, స్వాతి, అలక నంద, సబిత, సాయికుమార్, జగదీష్, శివప్రసాద్, వినయ్, పిఈ టీలుగాగణేష్, ప్రణయ్, నరేందర్ వ్యవహరించారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎంసి చైర్మన్ అనంతయ్య, ఉపాధ్యాయులు శ్రీను, సురేష్, రామయ్య, జీవన్‌కుమార్, రాజ్‌కుమార్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు.